క్లుప్తంగా

కంటి వెలుగు స్క్రీనింగ్ టెస్ట్‌లు ప్రారంభం



గుంటూరు రూరల్: మానవ శరీరంలో కళ్లు ప్రధానమైనవని, వాటిని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా కాపాడుకోవాలని ఏపీఎంవో లీలావతి తెలిపారు. 47వ డివిజన్ గోరంట్ల 198వ వార్డు సచివాలయం పరిధిలో కంటి వెలుగు స్క్రీనింగ్ టెస్ట్‌లను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎంవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అర్హులైన వారికి కళ్లజోళ్లు కూడా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా రెడ్డిపాలెం, గోరంట్ల తదితర ప్రాంతాల ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లతో పాటు మెరుగైన చికిత్సలకోసం జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. కార్యక్రమంలో వార్డు సచివాలయం ఉద్యోగులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దాళ్వాలో కాండం తొలుచు పురుగుతో తీవ్ర నష్టం



గరికపాడు(కాకుమాను): దాళ్వాలో వరి సాగు చేస్తున్న రైతులంతా కాండం తొలుచు పురుగుపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ పి.రామాంజనేయులు సూచించారు. మండలంలోని గరికపాడులో వరి పొలాల్ని గురువారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కాండం తొలుచు పురుగు కనిపిస్తున్న దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలని, లేనిపక్షంలో తీవ్ర నష్టం వాటిల్లుతుందని చెప్పారు. పంటపై పురుగు కనిపించిన వెంటనే ఎకరాకు 400 గ్రాముల కాంటఫ్ మందును నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ కె.కిరణ్మయి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కలుపు శాస్త్రవేత్తకు ఉగాది పురస్కారం


డాక్టర్ సుబ్రహ్మణ్యం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సమగ్ర కలుపు యాజమాన్యం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి. సుబ్రహ్మణ్యంకు ఉగాది పురస్కారం లభించింది. ఉపాధ్యాయుడిగా, పరిశోధకుడిగా, విస్తరణ శాస్త్రవేత్తగా ఆయన కృషికి విశ్వవిద్యాలయం ఉప కులపతి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. గతంలో ఆయన 2017లో భారత కలుపు పరిశోధన స్థానం జబల్‌పూర్ నుంచి పలు అవార్డులు కూడా అందుకున్నారు. ఉగాది పురస్కారం పొందిన సందర్భంగా గురువారం నగర శివారుల్లోని ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం అధికారులు, శాస్త్రవేత్తలు ఘనంగా ఆయన్ను సన్మానించారు.

అమర వీరులకు ఘన నివాళి

పెదనందిపాడు: బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా భారతదేశ స్వాతంత్ర్య సముపార్జనకు, విప్లవోద్యమ అవశ్యకతను గుర్తించి ఆ దిశగా పోరాటాన్ని నడిపిన అమరవీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అని సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ పేర్కొన్నారు. పెదనందిపాడులో గురువారం సాయంత్రం భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నేటి కేంద్ర ప్రభుత్వ విధానాలకు ప్రతి ఒక్కరూ వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, చుక్కా యానాదులు, పి. భువనేశ్వరి, మద్దూరి రమణ, కొత్త వెంకటశివరావు పాల్గొన్నారు.

స్వర్ణభారతీనగర్‌లో మసీదు ప్రారంభం


మత పెద్దలతో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత తదితరులు

గుంటూరు రూరల్: 41వ డివిజన్ అడవితక్కెళ్లపాడులోని స్వర్ణభారతీనగర్‌లో గురువారం మస్జిద్-ఏ-అబుహురైర ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత తొలుత ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మాసంలో పవిత్ర ఉపవాస దీక్షలు చేసి అల్లా కృపను పొందాలని ఆకాంక్షించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పార్టీలు,కులమతాలకు ప్రతి కుటుంబానికీ అతీతంగా సంక్షేమ పథకాల్ని అందజేస్తున్న జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని ఆమె తెలిపారు. బీసీలు, ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి ఆయన కృషి వెలకట్టలేదని చెప్పారు. ప్రతిపక్షాలు కావాలని రాజకీయాలు చేస్తూ ప్రభుత్వంపై బురద జల్లేందుకు కుట్రలు పన్నుతున్నాయని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ జగనన్నకు అండగా ఉండి అఖండ మెజార్టీని అందించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బొడ్డుపల్లి స్మితపద్మజ, నగర డెప్యూటీ మేయర్ షేక్ సజీల, రూరల్ మండలం జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, ప్రత్తిపాడు జెడ్పీటీసీ సభ్యుడు విప్పాల కృష్ణారెడ్డి, గుంటూరు జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ జిలాని, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, ముస్లిం మత పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆధునిక వైద్యంలో సాంకేతికతకు పెద్దపీట


అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ఆధునిక వైద్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం ప్రధాన పాత్ర పోషిస్తోందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. గురువారం చౌడవరంలోని కళాశాలలో డాక్టర్ కె. గోపీచంద్, కె. అక్కమ్మ మెడికల్ సొసైటీ సహకారంతో బయోమెడికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ అడ్వాన్సెస్ ఇన్ ఈఎన్‌టీ అనే వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు మాట్లాడుతూ వైద్య రంగంలో ఇంజనీరింగ్ విద్యార్థుల నూతన పరిశోధనలకు మంచి డిమాండ్ ఉందని తెలిపారు. డాక్టర్ సాగర్ ఈఎన్‌టీ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ విద్యాసాగర్ రామకృష్ణన్ మాట్లాడుతూ ఆధునిక వైద్యరంగంలో ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఇంజనీర్లు తయారు చేసిన పరికరాలు నేడు వైద్యరంగంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. రోగి ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు అంతర్భాగాల్లోకి అతి సూక్ష్మ లేజర్ లైటింగ్‌తో కూడిన పరికరాన్ని పంపి అవయువాల పనితీరు, లోపాల్ని సులువుగా తెలుసుకోగలుగుతున్నట్లు చెప్పారు. తద్వారా రోగికి మెరుగైన చికిత్సలు అందిస్తున్నామని పేర్కొన్నారు. నేడు రోబోటిక్ సహాయంతో వైద్య రంగంలో శస్త్రచికిత్సలు చేసే స్థాయికి టెక్నాలజీ పెరిగిందంటే ఇందుకు ఇంజనీరంగ్ విద్యార్థుల నూతన ఆలోచనా ప్రయోగాలే కారణమని వివరించారు. ప్రతి విద్యార్థి లక్ష్యసాధన దిశగా కృషి చేసి ఉజ్వల భవిష్యత్తును పొందాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు, డాక్టర్ కె. చంద్రశేఖర్, డాక్టర్ స్వర్ణశ్రీ పాల్గొన్నారు.

భర్త, మామపై వరకట్న వేధింపుల కేసు

చేబ్రోలు: భర్త, మామ అధిక కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని చేబ్రోలుకు చెందిన మహిళ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదవపాలేనికి చెందిన స్వాతికి ఇదే ప్రాంతానికి చెందిన వేపూరి వీరాంజనేయులతో ఐదు సంవత్సరాల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు కూడా ఉన్నారు. పెళ్లి అనంతరం భర్త వీరాంజనేయులు, మామ శ్రీనివాసరావు పుట్టింటి నుంచి అధిక కట్నం తీసుకురావాలంటూ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నారు. రెండో ఆడపిల్ల పుట్టినప్పటి నుంచి భర్త కాపురానికి తీసుకెళ్లకుండా పది లక్షల రూపాయల అధిక కట్నం తీసుకురావాలని, లేకపోతే చంపుతానని బెదిరిస్తునట్లు స్వాతి ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు భర్త, మామలపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె. ఆనంద్ తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

గుంటూరు ఈస్ట్: అధిక కట్నం కోసం భర్త, అతని కుటుంబ సభ్యులు మహిళను వేధించి ఇంట్లోంచి తరిమి వేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారానికి చెందిన మోతడక సుచిత్రకు, యశ్వంత్‌కు 2021లో వివాహమైంది. యశ్వంత్, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సుచిత్రను అధిక కట్నం తేవాలంటూ వేధింపులకు గురిచేసి ఇంట్లో నుంచి తరిమి వేశారు. ఈ మేరకు బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా డిజిటల్ బ్యాంకింగ్ యూనిట్ ప్రారంభం


యూనిట్‌ను ప్రారంభిస్తున్న చంద్రకాళీ ప్రసాద మాతాజీ

కొరిటెపాడు: గుంటూరు సమీపంలోని కాళీ గార్డెన్స్ ప్రాంగణంలో బ్యాంక్ ఆఫ్ బరోడా డిజిటల్ బ్యాంకింగ్ యూనిట్ నంబూరు బ్రాంచ్‌ను చంద్ర కాళీ ప్రసాద మాతాజీ గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ జోనల్ హెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ మన్మోహన్ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి డిజిటల్ బ్యాంకింగ్ యూనిట్‌ను కాళీ గార్డెన్స్ ప్రాంగణంలో ప్రారంభించడం అభినందనీయమని తెలిపారు. సేవల్ని ఖాతాదారులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రీజనల్ హెడ్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి. అమర్‌నాథ్‌రెడ్డి, డెప్యూటీ రీజనల్ మేనేజర్ ఎం. విద్యాసాగర్, బ్యాంకు అధికారులు, సిబ్బంది, డిజిటల్ బ్యాంకింగ్ యూనిట్ గుంటూరు బ్రాంచ్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రవిశంకర్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులు, తల్లిదండ్రులకు సన్మానం



సన్మానంలో చైర్మన్ లావు రత్తయ్య, లెఫ్టినెంట్ కల్నల్ సిద్ధు

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ తరఫున న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న ఇద్దరు ఎన్‌సీసీ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్ని గురువారం ఘనంగా సన్మానించారు. విద్యార్థులు షేక్ అస్విల్ అహ్మద్, బాగం రాఘవి ప్రధానమంత్రి ర్యాలీతో పాటు, ఫ్లాగ్ ఏరియా కాంపిటీషన్ విభాగాల్లో పాల్గొని సత్తా చాటారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గుంటూరు 25 ఏ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ సీఎస్ సిద్ధు మాట్లాడుతూ రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనే వారికి కఠోర శిక్షణతో పాటు పలు దఫాలుగా నిర్వహించే క్యాంపుల్లో ప్రతిభ చూపిన విద్యార్థుల్ని మాత్రమే ఎంపిక చేస్తామని వివరించారు. చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ ఎన్‌సీసీ వల్ల క్రమశిక్షణతో పాటు కలసిమెలసి ఉండటం, ప్రజలకు సామాజిక సేవ చేసే అవకాశం దొరుకుతుందని తెలిపారు. కార్యక్రమంలో వీసీ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎం.ఎస్. రఘునాథన్, డీన్లు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి వ్యాప్తిపై అప్రమత్తత అవసరం


అవగాహన ర్యాలీలో వైద్యాధికారులు, సిబ్బంది

చేబ్రోలు: క్షయ వ్యాధి వ్యాప్తిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గుంటూరు జిల్లా వైద్య శాఖాధికారి శ్రావణ్ సూచించారు. మార్చి 24న టీబీ దినోత్సవం సందర్భంగా పొన్నూరు పట్టణంలో గురువారం అవగాహన ర్యాలీతో పాటు వివిధ కార్యక్రమాల్ని నిర్వహించారు. పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుంచి నర్సింగ్ విద్యార్థులు, వైద్య సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్లో నృత్యంతో పాటు నాటికను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రావణ్ మాట్లాడుతూ వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తూ దేశం నుంచి క్షయ వ్యాధిని పారదోలాలని పిలుపునిచ్చారు. నేడు వ్యాధి వ్యాప్తి ఎక్కువగా ఉందన్నారు. దీనికి మైకో బ్యాక్టీరియం ట్యూబర్ కిలోసిస్ అనే బ్యాక్టీరియా ఒకరి నుంచి మరొకరికి దగ్గినపుడు నోటి తుంపరల ద్వారా వ్యాప్తి చెందడమే కారణమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రత్నమోహన్, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ షేక్ మీర్ హుస్సేన్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శివగోపాల్, డాక్టర్ ఆదిల్, డాక్టర్ యశ్వంత్, రేష్మా, డాక్టర్ హేమలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడు ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: కనిపించకుండా పోయిన యువకుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కోబాల్డ్‌పేట 7వ లైనుకు చెందిన చెవుల మల్లికార్జునరావు (28) గతనెల 26న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై కుటుంబ సభ్యులు ఈనెల 10న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, మల్లికార్జునరావు మృతదేహాన్ని తాడేపల్లి సమీపంలోని వడ్డేశ్వరం మద్రాస్ కెనాల్‌లో గురువారం గుర్తించారు. జేబులోని ఆధార్ కార్డును బట్టి స్థానిక పోలీసులు పట్టాభిపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని మార్చురీకి తరలించారు.

జూదరుల అరెస్టు

గుంటూరు ఈస్ట్: పేకాట ఆడుతున్న ఆరుగురిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. భారత్‌పేట 3వ లైనులో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు గురువారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 6,420 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంగం డెయిరీలో అక్రమాలపై విచారణ జరపాలి

శాసనసభలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రస్తావన



చేబ్రోలు: వడ్లమూడి సంగం డెయిరీలో అక్రమాలు, దొంగ సొసైటీలపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య గురువారం శాసనసభలో ప్రస్తావించారు. పాడి పరిశ్రమపై శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పాడి రైతులకు మేలు చేస్తున్నారని తెలిపారు. అమూల్ వచ్చిన తర్వాత రూ. 45 ఉన్న పాల ధర రూ. 65కు చేరిందన్నారు సంగం డెయిరీలో ధూళిపాళ్ల నరేంద్ర బోనస్‌ల రూపంలో పాల ఉత్పత్తిదారులకు టిఫిన్లు బాక్సులు, క్యారేజీలు ఇచ్చి వందల కోట్ల రూపాయలను డీవీసీ ట్రస్టుకు మళ్లించుకున్నట్లు ఆరోపించారు. దొంగ సొసైటీలు ఏర్పాటు చేసి సంగం డెయిరీని అక్రమంగా దోచుకున్నారని తెలిపారు. డీవీసీ ట్రస్టు ద్వారా వచ్చిన వందల కోట్ల రూపాయలతో హాస్పిటల్ నిర్మించారని, దాన్ని ఆయన కుటుంబ సభ్యులే నిర్వహిస్తున్నట్లు ఆరోపించారు. రైతులకు చెల్లించాల్సిన బోనస్‌లపై వెంటనే విచారణ జరపాలని శాసనసభ స్పీకర్‌ను ఎమ్మెల్యే కిలారి కోరారు.

1నుంచి జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో వర్క్‌షాప్


వర్క్‌షాప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ కరుణ తదితరులు

ఏఎన్‌యూ: నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో ఏప్రిల్ ఒకటి నుంచి మూడో తేదీ వరకు జాతీయ స్థాయి వర్క్‌షాప్ జరగనుంది. వర్క్‌షాప్ పోస్టర్‌ను గురువారం వీసీ పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్ డైరెక్టర్, జర్నలిజం విభాగ అధ్యాపకుడు జె. మధుబాబు మాట్లాడుతూ 'సినిమా– సామాజిక అవసరత' అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సామాజిక సమాంతర చలన చిత్రాలపై విశ్లేషణ, భారతదేశంలో చలన చిత్ర రంగ అభివృద్ధి, దళిత, మానవ హక్కుల ఉల్లంఘన, మహిళల సమస్యలు, హింస వంటి చలన చిత్రాలపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. కీలకోపన్యాసకులుగా గిరీష్ కాసరవల్లి (బెంగుళూరు), షాజీ ఎన్. కరుణ్ (త్రివేండ్రమ్),సి.ఉమామహేశ్వరరావు, ఎం.వి.రఘు, పి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఆర్.వి.రమణి, బుర్రా సాయి మాధవ్, బసవ శ్రీవిద్య, సీనియర్ ఎడిటర్ తెలకపల్లి రవి, ఢిల్లీ జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ కృష్ణ శంకర్ కుసుమ, కేరళ కేంద్రీయ విశ్వ విద్యాలయానికి చెందిన డాక్టర్ వెల్లక్కీల్ రాఘవన్, చలనచిత్ర విశ్లేషకులు రెంటాల జయదేవ్ తదితరులు పలు అంశాలపై ప్రసంగిస్తారని వివరించారు. సదస్సుకు జర్నలిజం విభాగాధిపతి జి. అనిత కోశాధికారిగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు జర్నలిజం అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోవాలి


ఎల్‌టీపీలతో సమావేశమైన సీపీ ప్రదీప్‌కుమార్

నెహ్రూనగర్: ఏకమొత్తంగా ఆస్తి, ఖాళీ స్థల పన్నులు చెల్లిస్తే, వాటిపై వడ్డీని మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల గడువు మరో ఎనిమిది రోజుల్లో ముగియనుందని సిటీప్లానర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఈ విషయాన్ని భవన నిర్మాణ యజమానులకు లైసెన్స్‌డ్ టెక్నికల్ ఇంజినీర్లు (ఎల్‌టీపీ) తెలియచేసి వారు పన్ను రాయితీని వినియోగించుకునేలా చూడాలని ఆయన కోరారు. ఆయన గురువారం కమిషనర్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎల్‌టీపీలతో ఖాళీ స్థల పన్ను వసూళ్లు, పన్ను రాయితీపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న భవన యజమానుల నుంచి ఖాళీ స్థల పన్ను వసూళ్లకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రభుత్వం ఇచ్చిన పన్ను రాయితీ ద్వారా భారీ మొత్తంలో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కొందరు ఖాళీ స్థల యజమానులు ఏళ్ల తరబడి పన్ను చెల్లించకుండా ఉన్నారని, వారికి పెద్ద మొత్తంలో వడ్డీ జమ అయిందని, వారికి కూడా పన్ను రాయితీ ద్వారా మినహాయింపు వస్తుందని పేర్కొన్నారు. భవన నిర్మాణదారులు కూడా నిర్మాణం పూర్తయ్యే వరకు లేదా ఆక్యుపెన్సీ వరకు వేచి చూడకుండా ఈ నెల 31లోపు పన్ను చెల్లించాలని, లేనిపక్షంలో వచ్చే నెల 1 నుంచి వడ్డీ కలిపి చెల్లించాలని చెప్పారు. ఇక నుంచి నగరపాలక సంస్థ నుంచి జారీ చేసే అనుమతులకు ఖాళీ స్థల పన్ను చెల్లించిన ఎన్‌ఓసీ తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు.